క్లుప్తంగా

5న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

గరుగుబిల్లి: పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్‌లో ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు బుధవారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వామన అవతారంలో జగన్నాథుడు



వామన అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శ్రీ జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలలో భాగంగా బుధవారం వామన అవతారంలో జగన్నాథస్వామివారు దర్శనమిచ్చారు. గుండిచా మండపం వద్ద ప్రతి రోజూ ప్రత్యేక పూజలు జరుపుతున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు గిరిధర పాత్రో తెలిపారు.

వామన, పరశురామ అవతారాల్లో జగన్నాథుడు..



జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు బుధవారం వామన, పరశురామ అవతారాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాలకొండ దేవాలయంలో ప్రధానార్చకుడు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేయగా.. భామిని మండలం బత్తిలిలో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

– పాలకొండ/ భామిని

పోస్టర్ల ఆవిష్కరణకే ప్రాధాన్యం

భామిని: మండలంలోని పసుకుడిలో టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, పార్టీ పరిశీలకుడు, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధి వివరించే ధైర్యం లేక పోస్టర్లు ఆవిష్కరించి వెనుదిరిగారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవినాయుడు, కేశవరావు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటకు గిరిబజార్ వాహనం



గిరిబజార్ వాహనం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏకు గిరిబజార్ వాహనం మంజూరైంది. దీంతో ఇకపై గ్రామాల్లో ఈ వాహనం ద్వారా సరుకులు విక్రయించనున్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురవుతున్న చిన మంగళాపురం - యరకారాయపురం రహదారి

పాలకొండ రూరల్: మండలంలోని చిన మంగళాపురం వయా యరకారాయపురం గ్రామాల మధ్య గల రహదరి కోతకు గురవుతోంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. రహదారికి ఓ వైపు నాగావళి నదీ తీరం ఉండడం, మరోవైపు విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డుపై గోతులేర్పడడంతో బలహీనమవుతోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ గోతిని గుర్తించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ప్రాణాలు హరించే విషనాగు

వర్షాకాలం.. పాములతో జరభద్రం..

- అప్రమత్తత తప్పనిసరి
- ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు : డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

భామిని: వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో పాముల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా పాము కాటుకు గురికాక తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో పాముకాటు వల్ల మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తున్నాయి. సీతంపేట మండలం చెక్కాపురంనకు చెందిన గిరిజనుడు మండంగి సంతోష్‌కుమార్ పాముకాటుకు గురై మంగళవారం మృతి చెందాడు. అలాగే భామిని మండలంలో ఓ వృద్ధుడు పాముకాటుకు గురై వైద్యసేవలతో బతికి బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నందున పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని అటు వ్యవసాయాధికారులు ఇటు వైద్యులు చెబుతున్నారు. పాము కాటుకు గురైన వారు మూఢ నమ్మకాలకు పోకుండా వెంటనే ఆస్పత్రులకు చేరుకుని, వైద్యసేవలు పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో యాంటీ స్నేక్‌వీనమ్ మందు అందుబాటులో ఉందని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు.



ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ఏఎస్‌వీ మందు

105 రకాలు..

పాముల్లో సుమారు 105 రకాలు ఉన్నప్పటికీ, ఐదు రకాలే విషపూరితమైనవి. నాగుపాము, రక్తపింజరి, కట్లపాము, నల్లతాచు, పసిరికి పాములు మాత్రమే విషాన్ని కలిగి ఉంటాయి. విషనాగు కోరల్లో 0.5 ఎంఎల్ నుంచి 2 ఎంఎల్ వరకు మాత్రమే విషం ఉంటుంది. మనిషికి కాటు వేయక ముందు ఆహారం కోసం సర్పం ప్రయత్నించి ఉంటే విష ప్రభావం పెద్దగా ఉండదు.

అప్రమత్తతే ముఖ్యం...

- సర్పాలన్నీ విష పూరితాలు కావు. కొన్ని మాత్రమే విష ప్రభావం కలిగి ఉంటాయి. పాము కరిచిన వారందరూ మృతి చెందరు. అప్రమత్తంగా ఉండి వైద్యం అదిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చు.
- ముందుగా పాము కరిచిన చోట పడిన గాట్లు లెక్కించాలి. ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే విషపు నాగు కాటు అని, మూడు అంతకంటే ఎక్కువ గాట్లు ఉంటే విషరహిత సర్పంగా గుర్తించాలి.
- విష నాగు కాటు వేస్తే శరీరం మొత్తం విషం ఎక్కడానికి 3 గంటల సమయం పడుతుంది. ఈలోగా వైద్యం అందిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చు.
- విషపు నాగు కాటు వేస్తే కాటుకు మీదుగా అంటే గుండె వైపు విషం వెళ్లకుండా గాయం పైన గట్టిగా కట్టు కట్టాలి.
- బాధితుడు భయపడకుండా ధైర్యం చెప్పాలి.
- సూదిలేని సిరింజిని పెట్టి గాటు నుంచి రక్తం తీసివేయాలి. అప్పటికే గాటు వద్ద రక్తం విష ప్రభావంతో నల్లబడి ఉంటుంది. దీంతో పాటు మిగతా రక్తం వచ్చే వరకు తీయాలి.
- నోరు పెట్టి విషాన్ని తీయకూడదు. గాయాన్ని కదలకుండా చూడాలి.
- ఎటువంటి పరిస్థితుల్లో నాటు వైద్యం చేయకూడదు.
- వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి.

మందులు సిద్ధం...



జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పాముకాటు మందు సిద్ధంగా ఉన్నాయి. అపోహలు వీడి బాధితులను ఆస్పత్రులకు తరలించాలి. అన్ని ఆస్పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందులున్నాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించేవరకూ ధైర్యం చెబుతూ ఉండాలి.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సారా స్వాధీనం



పట్టుబడిన సారాను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని దొనక వీధి, రెల్లి వీధిలో కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి బుధవారం సారా అక్రమ తయారీ, అమ్మకాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో సారా విక్రయిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడని, మరో వ్యక్తి తప్పించుకుపారిపోయాడని సీఐ తెలిపారు. వీరి నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. తప్పించుకున్న వ్యక్తిపై గతంలో సారాయి కేసు ఉందని, ఆ వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు పశుదాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులంతా పశుసంవర్ధక శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్న పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో రాయితీపై అందజేస్తున్న రాయితీ పశుదాణాను బుధవారం ఆమె పలువురు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం మరియు ఉత్పత్తిని కాపాడటానికి రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేయడం జరుగుతోందన్నారు. పశువైద్యాధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ 50 కిలోల దాణా అసలు ఖరీదు రూ.1110 కాగా తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం సబ్సిడీ కల్పిస్తూ కేవలం రూ.555లకే అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతుకు 3 నెలలకు విడతల వారీగా 450 కిలోల దాణాను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న యువత

సీతంపేట: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పాథాలజిస్ట్ పి. అమృత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం 30 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : పీవో



భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజ్‌లో చేపట్టిన పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవ

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలం సీజన్లో వచ్చే వ్యాధుల బారిన విద్యార్థులెవరూ పడకుండా వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. మండలంలో తన పర్యటనలో భాగంగా ముందుగా ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను, అనంతరం భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కళాశాలను, అలాగే కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిక్ రూంలను సందర్శించి విద్యార్థులకు కలుగుతున్న అనారోగ్యం, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెనూ తనిఖీ చేసి నిర్దేశించిన మెనూ అమలు చేయాలన్నారు. భద్రగిరి గురుకుల కళాశాల భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతుండడంతో నివారణకు చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో అన్ని గదులకు లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చూడాలని కొరతగా ఉంటే నివేదికను అందజేయాలని కోరారు. ఆయన వెంట కురుపాం ఏటీడబ్ల్యూవో చంద్రబాబు, ప్రిన్సిపాళ్లు వీర్‌సింగ్, ఎం.యుగంధర్ ఉన్నారు.

రక్తహీనతను అధిగమిద్దాం..

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

పాలకొండ రూరల్: రక్తహీనతను అధిగమించేందుకు వైద్యులు తెలియజేస్తున్న సూచనలను ప్రజలు అనుసరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కె. విజయపార్వతి అన్నారు. ఎనీమియా యాక్షన్ కమిటీ గ్రామాల్లో అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలించే క్రమంలో మండలంలోని బెజ్జి గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనతను అధిగమించేందుకు మహిళలు, గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా పౌష్టికాహార విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గల పిల్లల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. మండలంలోని ఎం.సింగుపురం, అన్నవరం పీహెచ్‌సీల పరిధిలో గల అన్ని సచివాలయాల్లో వైద్యాధికారులు ఎస్.రవికుమార్, వి.కమల్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

గారమ్మకాలనీలో రహదారి కష్టాలు



గారమ్మకాలనీ ఓ వీధిలో అంతర్గత రహదారి దుస్థితి

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి రెండో అతిపెద్ద గారమ్మ కాలనీలో అంతర్గత రహదారి కష్టాలు కొనసాగుతున్నాయి. వందలాది అవాసాలున్న ఈ ప్రాంతాల్లో ముఖ్యంగా రోడ్లు సక్రమంగా లేకపోవడం.. తాజాగా కురుస్తున్న వరుస వర్షాల ధాటికి ఉన్న గ్రావెల్ రహదారులు బురదమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు వీధి దీపాలు, డ్రైనేజీల నిర్వహణ లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అన్నదాతల అవస్థలు ..

పాలకొండ రూరల్: వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. గడిచిన నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మెట్టు భూములు, లోతట్టు పంట భూముల్లో నీరు చేరుతోంది. వాతావరణ పరిస్థితులను ఆసరాగా చేసుకుని మండలంలో దాదాపు 8 వందల ఎకరాల్లో వెదలు జల్లారు. మరో 4 వందల ఎకరాల్లో నారు పోశారు. అయితే వరుస వర్షాలతో వీరఘట్టం రహదారి, రాజుపేట, భాసూరు, తదితర గ్రామాల సమీపంలో పంట భూముల్లో నీరు చేరడంతో విత్తనాలు తేలిపోతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తిక మృతి తీరనిలోటు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం పి.లేవిడి గ్రామానికి చెందిన పత్తిక మోహన్‌దాసు మృతి చెందడం ఏజెన్సీ పొర్జా పైడి కులానికి తీరని లోటని ఆ కులం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మక జేసురాజు, కార్యదర్శి బిడ్డిక గణేష్ పేర్కొన్నారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా మోహన్‌దాసు ఆయా వివాదాల్లో కోర్టు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారి పక్షాన ఉంటూ ఇరువర్గాలను సమన్వయపరచి వారి సమస్యలు పరిష్కరించేవాడని, అంతేకాకుండా ఏజెన్సీ పొర్జాపైడి కులం గుర్తింపు, రిజర్వేషన్, హక్కుల కోసం పొర్జా పైడి కులస్తులు చేస్తున్న పోరాటాన్ని ముందుండి నడిపించేవారని తెలిపారు. అటువంటి వ్యక్తి ఆకస్మిక మరణం తమ కులానికి తీరని లోటని ఈ సందర్భంగా వారు పేర్కొంటూ మోహన్‌దాసు కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

జియ్యమ్మవలస (రూరల్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలపై వేధింపులకు నిరసనగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యలు బంద్‌కు పిలుపునిచ్చామని ఏపీపీయూఎస్ఎంఏ వైస్ చైర్మన్ రౌతు సరళకుమారి బుధవారం తెలిపారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు ఆర్‌టిఈ 12.1సి దరఖాస్తులను తగిన ధ్రువీకరణ లేకుండా చేర్చుకోవాలని బలవంతం చేయడం షోకాజ్ నోటిసులు ఇవ్వడం, పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని బెదిరించడం ఇలా అనేక విధాల ఒత్తిడిలను తెచ్చి పలు ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకునేలా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



మాట్లాడుతున్న న్యాయవాది మురళీమోహన్

పాలకొండ: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. పట్టణంలో సీపీఐ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం చొప్పున పేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 8న స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. న్యాయవాది ఉత్తరావలి మురళీమోహనరావు మాట్లాడుతూ.. పేదల పక్షాన పోరాటం చేసే వారికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, కూరంగి జగదీష్, కోటిపాం త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి...



సాంబర దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న పీవో అశుతోష్ శ్రీ వాస్తవ

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని, ఉద్యోగ సమయంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తూ జూన్ 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన బిడ్డిక సాంబరకు ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల వద్ద ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐటీడీఏ పీవో మాట్లాడుతూ 39 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపూర్తిగా నిర్వహించడం, ఎంతో మంది విద్యార్థుల్ని విద్యావంతులుగా, ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దడం అభినందించదగ్గ విషయమన్నారు. సాంబర, రామమ్మ దంపతులకు దుశ్శాలువతో సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సహోపాధ్యాయులు, గ్రామపెద్దలు కూడా ఉద్యోగ విరమణ పొందిన సాంబరకు సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కురుపాం ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు తదితరులున్నారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కూడా సన్మాన కార్యక్రమంలో పాల్గొని సాంబర దంపతులను సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్..



పెదగుడబలో క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

గరుగుబిల్లి: గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని పెదగుడబ గ్రామంలోని పలు వీధులలో బుధవారం పర్యటించి గ్రామంలో జరుగుతున్న క్లోరినేషన్ పనులను, ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలను శుభ్రం చేయడంతో పాటు రహదారిపై మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు నిల్వలుంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం వుందన్నారు. రక్షిత పథకాల వద్ద, బోర్లు వద్ద ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయిస్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో జ్వరాల బారిన పడితే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కార్యాలయ ఏవో అర్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సమయపాలన పాటించాలి



తాడికొండ డీఆర్ డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ డీఎం

గుమ్మలక్ష్మీపురం: సేల్స్‌మేన్లు, డీలర్లు డిపోల నిర్వహణలో సమయ పాలన పాటించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ జె.రామారావు అన్నారు. కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి డీఆర్ డిపోను, గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ, రెల్ల, కేదారిపురం గ్రామాల్లోని డీఆర్ డిపోలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా డిపోల్లో సరుకులను, రికార్డులను పరిశీలించారు. సేల్స్‌మేన్లు విధిగా సమయపాలన పాటించాలని, వర్షాకాలం నేపథ్యంలో సరుకులు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ నెలా నిర్దేశించిన సమయంలోగా రేషన్ సరుకుల పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాము, సేల్స్‌మేన్ కె.భాస్కరరావు ఉన్నారు.

సమ్మె నోటీస్



డాక్టర్ సాయికుమార్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న ఆశా కార్యకర్తలు

వీరఘట్టం: ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ జూలై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్లు స్థానిక పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికుమార్‌ను బుధవారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని.. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

భామిని: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని బత్తిలి రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కౌలు ధ్రువీకరణ పత్రం 11 నెలలు పాటు మాత్రమే అమలులో ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో భూమిని కౌలుకు ఇచ్చే యజమానులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు దిలీప్, సహాయ సర్వేయర్ సాయి, కో ఆప్షన్ సభ్యుడు విశ్వనాథ్ పట్నాయక్ , రైతులు పాల్గొన్నారు.

● ఏజెన్సీలో వర్షం



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షం ఎడతెరిపివ్వడం లేదు. బుధవారం వేకువ జాము నుంచే ప్రారంభమైన వర్షం కురుస్తూనే ఉండటంతో రోడ్లని చిత్తడిగా మరాయి. రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షం కారణంగా రోజువారీ కూలీలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు కూడా అసౌకర్యానికి గురయ్యారు. అయితే ఈ వర్షం రైతులకు అనుకూలమని పేర్కొంటున్నారు.